
# సెటిల్‌మెంట్

వాణిశ్రీ



రామబ్రహ్మం హుషారుగా బయల్దేరాడు హనుమంతయ్య ఫ్లాట్‌కి. తన బర్త్‌డే పార్టీకి రమ్మని ఫోన్ చేశాడు. పార్టీ అంటే మందు పార్టీయే. రామబ్రహ్మం సర్వీసులో వున్నప్పుడు మందు పార్టీలకు కొదవ వుండేది కాదు. రిటైర్ అయిన తర్వాత పిలిచేవాళ్లే లేరు.

హనుమంతయ్య అతని కొలీగ్. రిటైరైపోయి ఒంటరిగా వుంటున్నాడు. భార్యపోయింది. పిల్లలు అమెరికాలో సెటిలైపోయారు.

రామబ్రహ్మం వెళ్లేసరికి పాత కొలీగ్స్ నలుగురూ చేరిపోయారు.

''రావోయ్ బ్రహ్మం నీ కోసమే ఎదురుచూస్తున్నాం.''అని ఆహ్వానించాడు హనుమంతయ్య.

''అప్పుడే పార్టీ మొదలా? ఇంకా ఎనిమిది గూడా కాలేదు.'' అంటూ కూర్చున్నాడు రామబ్రహ్మం.

పార్టీ మొదలైంది.

''బ్రహ్మం! మా పనిమనిషి మరీ ముసలమ్మయిపోయిందోయ్. ఎవరైనా అమ్మాయిని చూడు. దీన్ని మాన్పించేస్తాను. గ్లాసులు, కప్పులు పగలగొడుతోంది. కూరల్లో వుప్పు, కారం దంచేస్తోంది. ఏమన్నా అంటే కళ్లు కనపడ్డం లేదు సారూ! అంటుంది. చస్తున్నాననుకో.''అన్నాడు హనుమంతయ్య.

''ఎన్నాళ్లనుంచో పనిచేస్తున్నది కదా! కంటికి శుక్లాలు వచ్చేయేమో? డాక్టర్‌కి చూపించి కళ్లజోడు ఇప్పించు. దివ్యంగా పనిచేస్తుంది. అంతేగాని కుర్రపిల్లల్ని పెట్టుకోకు. ప్రాబ్లమ్స్ వస్తాయి'' అన్నాడు రామబ్రహ్మం.

''ఏం ప్రాబ్లమ్స్ వస్తాయంటావు? సరిగా పనిచేస్తే వుంటుంది. లేకపోతే పోతుంది''అన్నాడు హనుమంతయ్య.

''మా గురవయ్యకి జరిగింది వింటే నువ్వీమాట అనవు'' అని నవ్వాడు రామబ్రహ్మం.

''ఎవరా గురవయ్య? ఏమాకథ?''

''మా వూరాయనేలే. నీలాగే రిటైరై ఒంటరిగా వుంటున్నాడు'' అని మొదలుపెట్టాడు రామబ్రహ్మం

ఒక రోజు పొద్దున్నే గురవయ్య ఫోన్ చేసి అర్జెంటుగా రమ్మన్నాడు. ఏంటయ్యా కథ? అంటే వచ్చాక చెప్తాను రమ్మన్నాడు. గురవయ్యకి కంగారెక్కువ. ఏ ప్రాబ్లమ్ వచ్చిందోనని వెళ్లాను.

నేను వెళ్లేసరికి గురవయ్య ఇంట్లో పనిచేసే అహల్య, దాని తల్లి చంద్రమ్మ, ఇంకెవరో యువకుడు వున్నారు. అక్కడ వాతావరణం ఎందుకో గంభీరంగా వుంది. ఆ యువకుడు ఖద్దరు బట్టల్లో దర్పంగా కనిపించాడు. గోల్డ్‌ఫ్రేమ్ బ్లాక్ కళ్లద్దాలు, చేతులకు వుంగరాలు ముంజేతికి బ్రాస్‌లెట్, మెడలో దళసరి చైనూ చూసి ఎవరో ఛోటా రాజకీయ నాయకుడేనని అనిపించింది.

అదేమాట చెప్పి గురవయ్య పరిచయం చేశాడు.

''యూత్ అసోసియేషన్ ప్రెసిడెంట్ లింగారావు.''

''మీ కోసమే ఎదురు చూస్తున్నాం'' అన్నాడు లింగారావు.

''నా కోసమా? ఏమిటి విశేషం?'' అన్నాను.

గురవయ్య ''అదీ...'' అని ఏదో చెప్పబోతుండగా లింగారావు అడ్డుకుని

''మీరుండండి నన్ను చెప్పనీయండి'' అన్నాడు.

''చెప్పండి'' అన్నాను.

''మీకు తెలుసుగా ఈ గురవయ్య ఇంట్లో ఈ పిల్ల పనిచేస్తుంది'' అన్నాడు.

''ఔను మొదట్లో చంద్రమ్మ చేసేది. తను మానేసి కూతుర్ని పెట్టింది'' అన్నాను.

''ఇప్పుడు ప్రాబ్లం ఏమిటంటే...మీ గురవయ్య, అహల్యకి కడుపు చేశాడు.''అన్నాడు రంగారావు.

నేను నెత్తిన బాంబ్ పడ్డట్టు అదిరిపడ్డాడు. నా మతిపోయింది. గురవయ్య వైపు అయోమయంగా చూశాను. గురవయ్య భయం భయంగా చూస్తున్నాడు. లోలోపల భయపడుతున్నట్లున్నాడు.

''దాని గతి ఏం కావాల్లో దేవుడో...'' అని చంద్రమ్మ ఏడుపు లంకించుకుంది.

అహల్య తల వంచుకొని కూర్చుంది.

''చంద్రమ్మా! ఎందుకేడుస్తావు? ఏడిస్తే ఏమొస్తుంది? నోర్ముయ్యి. సారు వచ్చారుగా. జరగబోయేది ఆలోచించుకోవాలి'' అని లింగారావు చంద్రమ్మని కసిరాడు.

నాకు అయోమయంగా వుంది. నాకు తెలిసి గురవయ్య అటువంటి వాడు కాదు. పూజలు అవీ చేస్తుంటాడు. పద్ధతిగానే వుంటాడు. ఇందులో ఏదో మతలబు వుందని నాకు అర్థమైంది. నా బుర్ర వేగంగా ఆలోచిస్తోంది.

''సార్! జరిగిందేదో జరిగిపోయింది. ఈ వ్యవహారం మీరే సెటిల్ చెయ్యాలి. మీరొచ్చాక ఆలోచిద్దామని అంటే సరే పిలవమన్నాను'' అన్నాడు లింగారెడ్డి.

అదన్నమాట సంగతి సెటిల్‌మెంట్ అంటే ఎంతో కొంత డబ్బు గురవయ్యతో ఇప్పించాలి. నిజంగా గురవయ్య తప్పు చేసి వుంటే తప్పదు. లేకపోతే?

నేను గురవయ్యను పక్కకి పిలిచి అడిగాను.

''ఏంటోయ్ గురవయ్యా! ఏమైనా కక్కుర్తి పడ్డావా? నిజం చెప్పు''

''నీ మీద ఒట్టు. నాకే పాపం తెలీదు.'' అన్నాడు గురవయ్య.

''సరే! నేనేం మాట్లాడినా నువ్వు నోరెత్తకు'' అని వార్నింగ్ ఇచ్చి రంగంలోకి దిగాను.

''లింగారావుగారూ! ఇందులో నేను చెప్పేది ఏం వుంది? ఇటువంటి కేసులు ఎన్నో పరిష్కారం చేసి వుంటారు. మీరే చెప్పండి.'' అనేసరికి అతగాడు వుబ్బిపోయాడు.

''ఆ పిల్లకి నాలుగోనెల వచ్చింది సార్! అబార్షన్ చేయడానికి వీల్లేని పరిస్థితి. మనం చేయగలిగింది ఏమిటంటే వెంటనే దానికి పెళ్లి చేసెయ్యడం. సంబంధం కూడా రెడీగా వుందట. కుర్రాడు ఆటో రిక్షా కొనిపెడితే పెళ్లి చేసుకుంటానన్నాడట. అందుకని లక్ష రూపాయలు ఇస్తే గొడవ తీరిపోతుంది.

''లక్షా...''అనేశాడు పైకి...

''లక్షా? అంటారేంటి? మీరు చేసిన వెధవ పనికి ఎన్ని లక్షలిచ్చినా తక్కువే. ఆడపిల్ల పరువు పోతుందని వూరుకుంటున్నా! నా సంగతి తెలీదు మీకు. ప్రెస్ మీట్ పెట్టించి పేపర్లో వేయిస్తా! దెబ్బకి కటకటాల వెనక్కిపోతారు'' అని రెచ్చిపోయాడు లింగారావు.

గురవయ్య వణికిపోతున్నాడు.

''మీరు వూరుకోండి లింగారావు గారూ!'' అని సముదాయించాను.

''ఏంటి సార్ ఈ అన్యాయం. అరవై ఏళ్లు దాటినాయన పదహారేళ్ల పిల్లని పాడుచేసి కడుపుచేశాడంటే ఎంత దారుణం? అంత కోరికలు వున్నవాడు గంతకు దగ్గ బొంతలా ఏ విధవరాలినో మళ్లీ పెళ్లి చేసుకొని వుండొచ్చుగా''

''అవన్నీ ఎందుకు లెండి? ఏం చేద్దాం అది ఆలోచిద్దాం'' అన్నాను లింగారావును అడ్డుకొని.


''చించేది పెట్టేది ఏమీ లేదు. లక్ష రూపాయలు ఇస్తే సెటిల్‌మెంట్. లేకపోతే చాలా దూరం పోద్ది వ్యవహారం.'' అన్నాడు లింగారావు సీరియస్‌గా.


''అలా కాదు లెండి'' అన్నాను.

''ఇంకేంటి?'' అన్నాడు లింగారావు.

''గురవయ్య వల్ల అహల్య గర్భవతి అయింది. కాబట్టి ఆ పిల్లని వేరే ఎవరికో ఇచ్చి పెళ్లి చెయ్యడం అన్యాయం. గురవయ్యకే ఇచ్చి పెళ్లి చేస్తే సరి'' అని గురవయ్యకి సైగ చేశాను.

గురవయ్య అర్థం చేసుకున్నాడు.






"నేను అహల్యను పెళ్లి చేసుకుంటాను" అన్నాడు గురవయ్య.

అహల్య నెత్తిన పిడుగుపడిన దానిలా వణికిపోయింది. చంద్రమ్మ అయోమయంగా చూసింది. లింగారావు షాక్ తిన్నవాడిలా అయిపోయాడు.

"ఇదేంటి సార్! ముసలోడికి పడుచుపిల్లనిచ్చి పెళ్లిచేయాలా? అన్యాయం" అని అరిచాడు లింగారావు.

"ఇందులో అన్యాయం ఏముంది? లోకంలో ఎన్నో వింతలు జరుగుతుంటాయి. నేనీ మధ్య టీవీలో వార్త చూశాను. పద్నాలుగేళ్ల పిల్ల అరవై ఏళ్ల ముసలాయనను ప్రేమించింది. ఆమె తల్లి దండ్రులు మాట్లాడకుండా పెళ్లి చేసి పంపేశారు. ఇరవై ఏళ్ల అమ్మాయి అరవై ఏళ్ల ముసలాయనను ప్రేమించిన కథతో సినిమా రాబోతోంది. అమితాబచ్చన్ హీరో. అలాగే అహల్య గురవయ్యను ప్రేమించింది. పెళ్లికి ఒప్పుకోరనో ఏమో తల్లికి చెప్పలేకపోయి వుంటుంది. కాకపోతే తొందరపడి గర్భం తెచ్చుకుంది. ఇప్పుడు వాళ్లిద్దరికీ పెళ్లి చెయ్యడం న్యాయమే." అన్నాను.

లింగారావుకి ఏం మాట్లాడాలో వెంటనే తోచలేదు. అయోమయంగా చూశాడు.

"అన్యాయంగా మాట్లాడుతున్నారండీ. ఈ పెళ్లి చేస్తే అహల్య అన్యాయమైపోతుంది." అన్నాడు.

"అదేం మాట. గురవయ్య పెళ్లిచేసుకోకపోతే అన్యాయమై పోతుంది. గురవయ్యను ప్రేమించి, శరీరం అప్పజెప్పి గర్భవతై ఇప్పుడు వేరే ఎవడినో పెళ్లిచేసుకొని కాపురం ఎలా చెయ్యగలదు? మనసొక చోట, మనువొక చోట జీవితం నరకం కదా? పైగా గురవయ్యకి పుట్టిన బిడ్డ గురవయ్యకే దక్కాలి. ఈ వయసులో బిడ్డతో హాయిగా ఆడుకుంటూ కాలక్షేపం చేస్తాడు" అన్నాను గంభీరంగా.

ఎవరూ మాట్లాడ్డం లేదు. అహల్య ఏడుపు ఆపుకోవడానికి కష్టపడుతోంది.

"చంద్రమ్మా! నువ్వేమంటావు? గురవయ్య మీ అమ్మాయిని పెళ్లి చేసుకుంటానంటున్నాడు" గట్టిగా అడిగాను.

"సార్‌కి వయసు మళ్లింది. ఏదైనా అయితే నా కూతురి గతేంటి?" అన్నది చంద్రమ్మ.

"చంద్రమ్మా నీకా దిగులు అవసరం లేదు. ఒక వేళ గురవయ్య పోయినా నీ కూతురికి నెల నెలా పెన్షన్ ఇస్తుంది గవర్నమెంటు. ఇప్పుడు వుంటున్న ఈ ఇల్లు మీ అమ్మాయికే ఆయన తదనంతరం చెల్లేట్లు రాయిస్తాను. గురవయ్య పిల్లలు అమెరికా నుంచి రారు. ఏం భయంలేదు" అన్నాను.

లింగారావుకి అసహనంగా వుంది.

"మీరెన్ని చెప్పినా ఈ సెటిల్‌మెంట్‌కి ఒప్పుకోను" సీరియస్‌గా అన్నాడు.

"ఇంతకంటే పరిష్కారం లేదు" అని నేనూ గట్టిగా చెప్పాను.

"మీరేంటి చెప్పేది? డబ్బు ఇవ్వందే కుదరదు. లేకపోతే బజారు కీడ్చి పరువు తీస్తాను." అని రెచ్చిపోతున్నాడు లింగారావు.

లింగారావుని చూసి గురవయ్య భయపడుతున్నాడు. నేను ఏం ఫరవాలేదని సైగ చేశాను.

అతని బాధ అతనిది. డబ్బు ఇచ్చేట్లు సెటిల్ చేస్తే అందులో సగం కమీషన్ వస్తుంది. అది పోయేట్లుందని అసహనం ప్రదర్శిస్తున్నాడు.

నాకు చంద్రశేఖర్ గుర్తొచ్చాడు. నా కొలిగ్ కొడుకు. ఆ ఏరియా పోలీస్ స్టేషన్లోనే ఎస్ఐగా పని చేస్తున్నాడు. ఆ మధ్య కనిపించి నన్ను గుర్తుపట్టి ఏదైనా అవసరం వుంటే ఫోన్ చెయ్యండి అంకుల్ అని మొబైల్ నెంబర్ ఇచ్చాడు. నేను నా మొబైల్లో నెంబర్ ఎంటర్ చేశాను.

చంద్రశేఖర్‌కి కాల్ చేసి వెంటనే రమ్మని అడ్రస్ చెప్పాను. నేను ఎవరికి ఫోన్ చేశానో లింగారావుకి తెలీదు.

"ఎవర్ని పిలిపించుకుంటారో పిలిపించుకోండి. నేను మాత్రం పెళ్లిగిళ్లీ అంటే ఒప్పుకోను" అని రాష్‌గా అన్నాడు.

నేను ఏం మాట్లాడలేదు.

కాసేపట్లో చంద్రశేఖర్ వచ్చాడు. అతన్నిచూస్తూనే లింగారావు బిత్తరపోయాడు. నేను పోలీసుల్ని పిలిపిస్తానని వూహించి వుండడు. కుర్చీలో నుంచి లేచి నిలబడి విష్ చేశాడు.

నేను జరిగింది అంతా చెప్పాను. చంద్రశేఖర్ పకపకా నవ్వాడు.

"ఏయ్ ముసలమ్మా! వెంటనే పెళ్లికి ఒప్పుకో. నీ కూతురు అదృష్టవంతురాలు. పెట్టిపుట్టింది. రెడీమేడ్‌గా కొడుకు, కూతురు, మనుమరాండ్రు సొంతిల్లు...మీ జాతకమే మారిపోయింది" అన్నాడు.

చంద్రమ్మ, అహల్య భయం భయంగా చూస్తున్నారు.

"లింగారావు ఆలస్యమెందుకూ? నువ్వే పూనుకోవాలి. కారు తీసుకురా. ఆర్యసమాజ్ ఆఫీసు తెలుసుగా. అక్కడికెళ్తే వాళ్లే పెళ్లి ఏర్పాట్లు చేస్తారు. పెళ్లయినట్లుగా సర్టిఫికెట్ ఇస్తారు" అన్నాడు చంద్రశేఖర్ నవ్వుతూ...

హఠాత్తుగా అహల్య లేచి "నేనీ పెళ్లి చేసుకోను..." అని గట్టిగా ఏడవడం మొదలుపెట్టింది.

చంద్రశేఖర్ అప్పుడు పోలీసు విశ్వరూపం చూపించాడు.

"ఎందుకు చేసుకోవే? సార్ అంటే ఇష్టమే కదా? సార్ వల్లే కదా నీకు కడుపు వచ్చింది" అని బండ బూతులు తిట్టాడు.

"నిజం చెప్పు? లేకపోతే స్టేషన్‌కి తీసుకెళ్లి నీ చేత అంతా కక్కిస్తాను" గర్జించి అన్నాడు.

అహల్య భోరున ఏడుస్తూ అసలు సంగతి చెప్పింది. శంకర్ అనే ఆటో డ్రైవర్, అహల్య ప్రేమించుకున్నారు. తొందరపడ్డారు. అహల్య నెల తప్పింది. వాడు ఆటో కొనిస్తేగాని ఇంట్లో ఒప్పుకోనని అడ్డం తిరిగాడు. చంద్రమ్మ దగ్గర స్తోమత లేదు. అహల్య పనిచేసే ఇంటి ఓనర్ గురవయ్య తేరగా కనిపించాడు. బెదిరిస్తే బెదిరిపోయే బెదురుగొడ్డని గ్రహించి డబ్బు గుంజడానికి నాటకం ఆడారు.

"నాటకాలాడతారే...!" అని బూతులు తిట్టి..

తల్లీ కూతుళ్లని స్టేషన్‌కి లాక్కెళ్లమని కానిస్టేబుల్స్‌కి పురమాయించేసరికి వాళ్లిద్దరూ ఎస్ ఐ కాళ్ల మీద పడిపోయి బోరుమన్నారు.

"ఈ నాటకం నాకు తెలీదు సార్!" అని లింగారావు సంజాయిషీ ఇచ్చుకుని జారుకున్నాడు.

"ఆ శంకర్ ఎక్కడుంటాడో చెప్పవే" అని అహల్యని నిలదీశాడు.

తర్వాత శంకర్‌కి, అహల్యకి పోలీస్ స్టేషన్‌లోనే పెళ్లి చేశారని చంద్రశేఖర్ చెప్పాడు.

రామబ్రహ్మం చెప్పడం పూర్తి చేశాడు.

"ఐతే పడుచుపిల్లని పెట్టుకోవడం ప్రాబ్లమేనంటావు" అన్నాడు హనుమంతయ్య.

అంతా నవ్వారు. ★